

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (23)

*స్నేహానంద లహరి*

మేము రామచంద్రకు ఉప్మా టిఫిను మాత్రమే చెయ్యడానికి కారణముంది.

అతడు మా ఇంట్లో గడపడానికి పూర్తిగా ఓ రోజు కేయించాడు.

అతగాడి పాకప్రావీణ్యం, ముఖ్యంగా వంకాయ–పాప్రికా (సిమ్లామిర్చి) కూర విషయం శ్రీమతికి తెలుసు.

బెర్లిన్ వస్తున్నట్లు అతడు నాకు తెలియబర్చినప్పుడు – ఆ కూరని ప్రస్తావించి, ''నీ పుణ్యమా అని ఇక్కడ ఓ కొత్త వంటకాన్ని ఎంజాయ్ చేస్తున్నాం. నువ్వు చెప్పిన విధానాన్నే తూచా తప్పకుండా అనుసరిస్తున్నాం కానీ – ఆనాటి రుచి మాత్రం రావడం లేదు'' అని ఉత్తరంలో వ్రాశాను.

దానికతడు వెంటనే, ''కాగితంమీద ఎంత పెట్టినా, ఏదో వివరం మిస్సవుతూనే ఉంటుంది. మీ ఇంట్లో భోంచేస్తానుగా – అప్పుడా కూర, సాంబారు నేనే చేస్తాను. పక్కనుండి చూస్తుంటే సులువులు తెలుస్తాయి'' అని బదులిచ్చాడు.

''రామచంద్రకు వంట చెయ్యడం సరదా కావచ్చు. కానీ మనింటికొచ్చి, తనే వంట చేసి, ఆ వంటతోనే ఆతిథ్యం స్వీకరించాలనుకునే ఔదార్యం అరుదైనది, అభినందనీయం. కానీ మనకది మర్యాద కాదు. అతడలా వ్రాసినా మన వంటలు మనం చేసి ఆతిథ్యమిద్దాం'' అని శ్రీమతికి చెప్పాను.

ఇంటికొచ్చినవాళ్లు తమ వంట తినాలి కానీ, వాళ్లచేత వండించడమేమిటీ అని ఇంటి దీపాలు అనుకోవడం సాధారణం. అందుకని శ్రీమతి నేనిచ్చిన సూచనని మెచ్చుకుంటుందనుకున్నాను.

కానీ ఆశ్చర్యంగా తను ఒప్పుకోలేదు, ''వంటొచ్చిన మగాణ్ణి మన వంటలతో మెప్పించలేమని మా నాన్నగారనేవారు. అతణ్ణే చెయ్యనిద్దాం. మనం నేర్చుకున్నట్లూ ఉంటుంది. అతడికేమో మనకేదో నేర్పానన్న తృప్తీ ఉంటుంది'' అంది.

ఇలాంటి విషయాలు చాలా లోతుగా ఆలోచిస్తుంది తను.

నేను రామచంద్ర గురించి తనకి పలుమార్లు పలు విశేషాలు చెప్పాను. వాటన్నింటినీ ఆకళింపు చేసుకుని రామచంద్ర మనస్తత్వాన్ని పట్టేసినట్లుంది. తను వంట చేసి మెప్పించడం కంటే, అతణ్ణి వంట చెయ్యనివ్వడమే – అతడికి ఎక్కువ సంతోషాన్నిస్తుందని ఆమె గ్రహించింది.

టిఫినవగానే – రామచంద్ర దంపతులు, శ్రీమతి వంటింట్లోకి వెళ్లిపోయారు.

''మా ఆయన అసలు సిసలు సైంటిస్టు. ఆఫీసుకి వెడితే లాబరేటరీ. ఇంట్లో వంటిల్లు. ప్రయోగాలే ప్రయోగాలు'' అందిట శ్రీమతి రామచంద్ర – వంటింట్లో అతడి ఉత్సాహానికి భాష్యం చెబుతూ.

ఆ రోజు వంకాయ–పాప్రికా కూర, సాంబారు అదిరిపోయాయి.

భోంచేస్తూ అతడికి చెప్పాను, ''ఇప్పుడో నిజం చెబుతున్నాను. మా ఇంట్లో ఈ పాప్రికా కూర పేరు రామచంద్ర కూర. రామచంద్ర కూరని రామచంద్రే వండగా తినడం ఈ రోజు మాకు ప్రత్యేకానుభూతి'' అన్నాను.

ఆ మాట నిజం.

ఎన్నో దశాబ్దాల తర్వాత ఇప్పటికీ మా ఇంట్లో ఆ కూరని రామచంద్ర కూర అనే అంటున్నాం.

రామచంద్ర వెంటనే, ''ఒక విధంగా ఆ పేరుకి నేను అర్హుణ్ణే. జర్మనీలో దొరికే కూరగాయలు, మసాలాలతో – ఈ కూరని నేనే కనిపెట్టాను. గోటింగన్లో కూడా చాలామందికి నేర్పాను. మెచ్చుకుని ఊరుకున్నవారే కానీ, ఇలా నా పేరు పెట్టినవారు లేరు. రావుగారి మర్యాదే వేరు'' అన్నాడు.

అతడి గొంతుని బట్టి నా మాటకి అతడెంత సంతోషించాడో అర్థమైంది.

అబద్ధంతో మనిషిని సంతోషపెట్టొచ్చు.

కానీ నిజంతో సంతోషపెడితే – ఆ కిక్కే వేరని – అప్పటి నా అనుభూతి చెప్పింది.

చాలాసేపు కబుర్లతో సరదాగా గడిచింది.

మాట్లాడే తెలుగులో యాస ఉన్నా ఆ దంపతులు తెలుగువారు కాదన్న భావం మాలో కలగలేదు.

వారి రాకకి గుర్తుగా టేపు రికార్డరులో వారి గొంతులు రికార్డు చేస్తున్నప్పుడు – ఆమె 'పదునాల్గు వర్ష.... సీతె పునీతే...' అని పాడేవరకూ వాళ్లు కన్నడిగులని స్ఫురించలేదు.

ఆ దంపతులు వెళ్లిపోతుంటే – ఆత్మీయులు దూరమౌతున్న అనుభూతి కలిగింది.

అలా బెర్లిన్ యాత్రకి వచ్చి మమ్మల్ని సందర్శించిన మరికొందరిలో మరపురాని, మరువలేనివాడు సుందరం.

ఫక్తు శాకాహారి ఐన సుందరం మిగతా విషయాల్లోనూ చాలావరకూ నాలాంటివాడే.

ఢిల్లీలో విమానమెక్కే ముందు పరిచయమయ్యాడు. క్షణాల్లో ఆత్మీయుడైపోయాడు.

ఫ్రాంక్‌ఫుర్‌ట్‌లో విడిపోయేక లాంగ్వేజ్ కోర్సు రోజులనుంచీ కూడా ఒకరినొకరు ఉత్తరాల్లో పలకరించుకునేవాళ్లం.

నాకులాగే అతడికీ జర్మనీ చాలా నచ్చింది.

తన అలవాట్లకి సరిపడని వాతావరణం.

తన అలవాట్లని సవాలు చేసే సదుపాయాలు.

వీటికతడు బెదిరిపోలేదు, మథన పడలేదు.

పైగా తన అలవాట్లని కాపాడుకుందుకు వాటినే సానుకూలం చేసుకున్నాడు.

తనుండే ఇంటి బాల్కనీలో కుండీల్లో పూలమొక్కలకి బదులు కొత్తిమీర, మెంతికూర పెంచుతున్నట్లు చెప్పాడు.

''వజ్రాన్ని నగల్లో పొదిగి అలంకరించొచ్చు. కుంకుడుకాయలు కొట్టడానికీ వాడొచ్చు. ఇక్కడికొచ్చి నువ్వు చేస్తున్నదిదా!'' అని కొందరతణ్ణి ఎగతాళి చేశారుట.

దానికతడు ఏమాత్రం చలించకుండా, ''ఏది వజ్రం, ఏది నగ, ఏది కుంకుడుకాయ – అన్న విషయంపై నాకు స్పష్టమైన అవగాహనుంది. మీకుందా?'' అనడిగి తనని గేలి చేసేవాళ్ల నోళ్లు మూయించేట్ట.

ఈ విషయం నాకతడు వ్రాసిన ఉత్తరంలో చదివిన వెంటనే ఎన్నో విషయాలు స్ఫురణకొచ్చాయి నాకు.

చరిత్రలో ప్రముఖుడైన ఫ్రెంచి చక్రవర్తి నెపోలియన్ కాలానికి, అంటే 1870కి ముందు, అల్యూమినియం అరుదైన లోహం.

ఉత్పత్తి బాగా తక్కువగా ఉండడంవల్ల దాని విలువ వెండి బంగారాలకంటే ఎక్కువుండేది.

అప్పుడు కోట్లకి పడగెత్తినవారు తప్ప వాడకానికి అల్యూమినియం పాత్రలు కొనలేకపోయేవారు.

నెపోలియన్ ఒకసారి పెద్ద విందు చేస్తూ, తన వైభవాన్ని ప్రదర్శించడానికిగానూ ముఖ్యమైన అతిథులకి అల్యూమినియం పళ్లాలు, కట్లరీ వాడి వారిని దిగ్భ్రమకు గురి చేసేట్ట. అందరికీ సరిపడేంత ఆల్యూమినియం సామగ్రి దొరక్క కొందరి విషయంలో వెండి, బంగారు సామగ్రితో సరిపెట్టుకోవాల్సొచ్చిందని నొచ్చుకున్నాట్ట.

ఆ తర్వాత కొన్ని దశాబ్దాలకి ఆల్యూమినియం పేదలకి మాత్రమే పరిమితమైతే అది వేరే సంగతి!

పళ్లాలు, నగలు, దుస్తులు వగైరాల విలువ కాలానుగుణంగా మారుతుంది.

కానీ జిహ్వ అందుకు విరుద్ధం.

ఏ కాలంలోనైనా రుచి, అభిరుచి పూర్తిగా వ్యక్తిగతం.

ఐనా పీజాలు తినేవారు తాము ఆధునికులమంటూ, మిర్చిబజ్జీల్ని ఇష్టపడేవారి అభిరుచిని గేలి చెయ్యడం ఇప్పటికీ చూస్తుంటాం.

అలాంటప్పుడే నాకు చిన్నప్పుడు మా తాతగారు తరచుగా చెబుతుండే ‘బక మరాళ సంవాదం’ స్ఫురణకొస్తుంది.

ఒక చెరువులో ఉన్న కొంగల మధ్యకు అనుకోకుండా ఓ హంస వచ్చినప్పుడు వాటిమధ్య జరిగిన సంభాషణను ప్రశ్న-జవాబుల రూపంలో చెప్పిన చాటుపద్యరూపమే బక మరాళ సంవాదం.

ప్రశ్న: ఎవ్వడవీవు కాళ్లు మొగమెర్రన?

జవాబు: హంసను

ప్రశ్న; ఎందునుండువో?

జవాబు: దవ్వుల మానసంబునను

ప్రశ్న: దాన విశేషములేమి చెప్పుమా?

జవాబు: మవ్వపు కాంచనాబ్జములు (బంగారు రంగు తామరపూలు), మౌక్తికముల్ (మంచి ముత్యాలు) కలవందు

ప్రశ్న: నత్తలో?

జవాబు: అవ్వి యెరుంగను (వాటి గురించి నాకు తెలియదు)

‘అన్న నహహా యని నవ్వె బకంబులన్నియున్’ అంటూ పద్యం ముగుస్తుంది.

సామాన్యులకి తమకి తెలిసిన కాసిని విశేషాలూ చాలా గొప్పవి.

గొప్పవార్ని కలిసినప్పుడు వారికి తెలిసిన గొప్ప విశేషాల్ని గ్రహించాలనుకోరు.

పైగా తమకు తెలిసిన అల్ప విశేషాలు తెలియనందుకు వారిని గేలి చేస్తారు.

సామాన్యుల గుంపులో ఒంటరి పండితుడి అవస్థని సరసంగా చెప్పిన ఈ పద్యం విన్నప్పుడు – చిన్నప్పుడే నాకు ఏది సామాన్యం, ఏది గొప్పతనం అన్నది ఎవరు ఎందుకు ఎలా అంచనా వేస్తారన్న సందేహం మొలకెత్తింది.

ఆ తర్వాత కాకియై కలకాలం జీవించేకంటే, హంసలా ఆర్నెల్లు బ్రతికితే చాలు – అన్న సామెత విన్నప్పుడు నా సందేహపు మొలకకు కొత్తచిగుళ్లు వచ్చాయి.

కవుల ఊహ ప్రకారం హంస రాజసమొలికే అందమైన పక్షి.

ఎక్కడో హిమాలయాల్లో మానస సరోవరంలో ఉంటూ – లేత తామర తూండ్లు భుజిస్తూ తన మానాన తను బ్రతుకుతుంది.

ఆ హంసవల్ల మానవాళికుండే ప్రయోజనమేమిటో తెలియదు.

కాకి నల్లగా, వికారంగా ఉంటుంది.

వికృతస్వరంతో కావుకావుమంటూ మనమధ్యనే తిరుగుతుంది.

మన చుట్టూ ఉండే చెత్తాచెదారాన్ని ఆహారంగా తీసుకుని వాతావరణ కాలుష్యంనుంచి విముక్తి కలిగించడంలో మనకి తన వంతు సాయం చేస్తోంది.

కావుకావు మంటుంది కానీ నిజానికి తనే మనని కాస్తోంది.

హంసతో పోల్చి కాకిని చిన్నబుచచ్చేవారిలో ఎంతమందికి ఈ అవగాహన ఉంది?

తెలుపు – ఆ తెలుపు చుట్టూ ఏర్పడిన సంస్కృతి, సంప్రదాయాలు – మనని మనమే చిన్నబుచ్చుకునేలా శాసిస్తూ, మనలో బానిస మనస్తత్వాన్ని పెంపొందిస్తున్నాయి.

సుందరం ఉత్తరంలో వ్రాసిన విశేషాలు చదివేక – ఇలాటింవెన్నో నాకు స్ఫురించాయి.

భావసామీప్యమో, సారూప్యమో – సుందరం నన్ను బెర్లిన్లో కలుసుకుందుకు తహతహలాడుతున్నాడు.

అతడు నన్నెంతలా ఇష్టపడ్డాడంటే, తనకి బాగా పరిచితుడైన ఓ రావుకి నా గురించి ప్రత్యేకంగా చెప్పాడు.

రావు కూడా ఓ సైంటిస్టు. డాడ్ స్కాలరు.

రాజస్థాన్‌లో పిళానీలో అతడి ఉద్యోగం. అతడికీ బెర్లిన్ ట్రిప్పుంది.

సుందరం మాటమీద ఆ ట్రిప్పులో అతడు భార్యాసమేతంగా మా ఇంటికొచ్చి ఓ పూట సరదాగా గడిపి వెళ్లాడు.

భాష, దేశం – ఈ రెండూ మనిషికి కుల మత జాతి వర్గ భేదాలకి అతీతమైన అనుబంధాన్ని కలిగించే అద్భుతాలు.

ఆ విషయం భాషకూ, దేశానికీ దూరమైనప్పుడే తెలుస్తుంది.

అంతకు పూర్వం పరిచయం లేకపోయినా, ఆ కాసేపటిలోనూ రావు దంపతులు మాకు ఆత్మీయులైపోవడానికి ఆ అనుబంధమే కారణమనుకోవాలి.

పిళానీ గురించి కొన్ని కొత్త విశేషాలు తెలిశాయి మాకు.

అది థార్ ఎడారికి దగ్గర్లో ఉందేమో – వేసవిలో ఏసీలకు లొంగని దారుణమైన వేడి.

శీతాకాలంలో హీటర్లకు లొంగని భయంకరమైన చలి.

వాటి సంగతలా ఉంచితే – ముఖ్యంగా వేసవిలో ఇసుక తుఫానులు వస్తాయిట. తలుపులన్నీ వేసినా ఇళ్లలోకి ఏదో ఓ చిన్న సందులోంచి సన్నని ఇసుక రేణువులు దూరి మంచాలు, అలమరలు వగైరాలమీద పేరుకు పోతాయిట.

ఇంటిలోపల సంగతే అలా ఉంటే – ఇక బయట విషయం వేరే చెప్పాలా?

సెలవులకి ఇల్లు తాళం వేసి కొన్నాళ్లు ఊరెళ్లి వస్తే ఇంట్లోకి వెళ్లాలంటేనే – ఇసుక మేటల్ని తొలిగించాలట.

వాళ్లు వర్ణించి చెబుతుంటే – ఆ పెద్దగీత ముందు మిగతా ప్రాంతాల్లో వచ్చే నీటి తుఫాన్లు బాగా చిన్నగీతలై తోచాయి.

మన దేశంలోనే వివిధ ప్రాంతాల్లో మనకు తెలియని ఎన్నో విశేషాలు.

అవిచ్చే అనుభూతుల్లో ఆహా అనిపించేవీ ఉన్నాయి, అమ్మో అనిపించేవీ ఉన్నాయి.

రావు భార్య ఉత్తరాదిన పెరిగిందిట.

ఆమెకి తెలుగు మాట్లాడ్డం వచ్చు కానీ, భాషమీద పట్టు లేదు.

ఐనా మేము రికార్డు చేసుకుంటామంటే – అలనాటి మల్లీశ్వరిలోని 'పిలచిన బిగువటరా' పాట పాడి మమ్మల్ని ఆశ్చర్యపర్చింది.

ఐతే ఆ పాటలో 'భళిరా రాజా' అన్న చోట ఆమె 'భళిరా జా' అనడంలో హిందీలా ధ్వనించింది.

'అందెల రవళుల సందడి మరి మరి' బదులు 'అందాల రమణుల సందడి మరి మరి' అన్నప్పుడు కృష్ణశాస్త్రికి మెరుగులు దిద్దినట్లు అనిపించింది.

అది సినీగీతాల అభిమానులకు ప్రాణప్రదమై నోట తిరిగే పాట కాకపోతే, ఈ మార్పులు గమనించడానికి వీలు కానంత చక్కగా ఆమె వరసను పట్టి ప్రదర్శించింది.

వాళ్లు వెళ్లిపోయేక మళ్లీ ఇంతవరకూ కలుసుకోకపోయినా – ఆ పాట వారి రాకకు సంబంధించిన తీయని అనుభూతిని స్ఫురణకు తెస్తూనే ఉంటుంది.

రావు దంపతుల్ని మా ఇంటికి పంపినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, సుందరానికి ఉత్తరం వ్రాశాను.

సుందరంనుంచి వెంటనే బదులొచ్చింది.

రావు కూడా మమ్మల్ని పొగుడుతూ ఆతడికో ఉత్తరం వ్రాసేట్ట.

అది చదివేక మమ్మల్ని కలుసుకోవడం ఎప్పుడెప్పుడా అన్న తహతహ తనలో మొదలైందిట.

''నాక్కూడా సతీసమేతంగా వచ్చి మీ ఇంట్లో గడపాలనుంది. నా భార్య మీ ఇంట్లో ఉండడానికి వీలౌతుందా? ఏ విషయం మొహమాటపడకుండా చెప్పండి'' అని వ్రాసాడు చివర్లో.

విషయమేమిటంటే డాడ్ సంస్థ ఏర్పాటు చేసే బెర్లిన్ విహారయాత్రలు బృందాలవారీగా ఉంటాయి. అవి డాడ్ స్కాలర్సుకి మాత్రమే పరిమితం. వచ్చిన బృందమంతా కలిసి ఒకచోటే ఉండాలన్నది నియమం.

సుందరం తన భార్యని తీసుకు రావాలంటే, ఆమె బెర్లిన్లో విడిగా వేరే హొటల్లో ఉండాలి.

''ఇండియాలోనే ఎప్పుడూ ఒక్కద్దాన్నీ హొటల్లో దిగలేదు. పరాయి దేశంలో ఎలా ఉంటాను? మీరొక్కరూ వెళ్లొచ్చేయండి'' అందిట ఆమె.

మావంటి స్నేహితుల ఇంట్లో ఉండడానికి ఆమెకి అభ్యంతరం లేదు.

కానీ ఎవర్ని పడితే వాళ్లని ఎప్పుడు పడితే అప్పుడు ఇంట్లో ఉండనివ్వడానికి ఇది ఇండియా కాదు కదా!

తోడబుట్టినవాళ్లొస్తేనే ఉండడానికి అనుమతి లభించని నియమాలున్న దేశమిది.

ఆ విషయం సుందరానికీ తెలుసు.

కానీ అంతకుముందు నేను మా ఇంటామె ఒలోముచ్‌కీ గురించి ఉత్తరాల్లో గొప్పగా వ్రాసి ఉన్నాను. అందుకే ఆ మాత్రం వ్రాసే ధైర్యం చేశాడు.

ఐతే నేను మాత్రం ఈ విషయమై ఒలోముచ్‌కీని అడిగే ధైర్యం చెయ్యలేకపోయాను. ఎందుకంటే – మేముండే అపార్టుమెంట్సులో ఎవరింటికీ అతిథులు రావడం చూడలేదు మేము. ఎవరి పనుల్లో వారుంటూ ఎవరి జీవితాన్ని వారు గడుపుతుంటారు వాళ్లు.

ఇరుగుపొరుగులతో కూడా ఎదుట పడినప్పుడు ఓ చిరునవ్వు.

గ్యూటెన్ మోర్గెన్ అన్న చిరు పలకరింపు.

అంతకుమించి పరిచయాలు లేవు.

అలాంటంది మా ఇంటికి తరచుగా ఎవరో ఒకరు వచ్చిపోవడం, చిల్లోబొల్లోమంటూ కబుర్లు.

''ఇక్కడి కుటుంబాలకి ఇలాంటి సమావేశాలు నచ్చవు. ఒలోముచ్‌కీ పసి కట్టిందంటే చిక్కుల్లో పడతావు'' అని ఓంప్రకాష్ ఒకసారి నన్ను హెచ్చరించాడు కూడా.

మా ఇంటికి అతిథుల రాక ఎక్కువేనని గ్రహించి, పాపం తను రావడం ఇంచుమించు మానుకున్నాడతడు. తనది హోస్టల్ కాబట్టి – మమ్మల్నే అక్కడకు రమ్మనేవాడు.

ఇప్పుడు సుందరం భార్య రాక గురించి చెప్పి అనుమతి కోరితే, కందిరీగల తుట్టని కదిపినట్లే!

ఇంతకాలం ఏ గొడవలూ లేకుండా రోజులు గడిచిపోతున్నాయి.

ఇంకా ఆమె దృష్టి నా ఇంటికొచ్చి పోతుండే అతిథులమీద పడలేదు.

ఐనా అందువల్ల తనకి కలిగిన ఇబ్బందేం లేకపోవడంవల్ల చూసీచూడనట్లు ఊరుకుంటోందని నా అనుమానం.

కానీ ఇప్పుడు నేనిలా ఆడగ్గానే, 'దొంగాడా కరవకురా' అన్నట్లయి – ఆమె నా ఇంటికొస్తూ పోతూండే అతిథుల విషయమై కొత్త నియమాలు సృష్టిస్తుందని నా భయం.

ఆ భయానికి కారణం లేకపోలేదు.

ఒక రోజు ఉదయం వంటింట్లో ఫ్రిజ్‌మీద ఓ చీటీ పెట్టి ఉంది.

'బహుశా మీరు ఇల్లు కాళీ చెయ్యాల్సి ఉంటుంది. ఈ రాత్రి పెందరాళే వస్తాను. కలుసుకో'

అది ఒలోముచ్‌కీ నాకిచ్చిన తాకీదు.

చదవగానే గుండె ఆగినట్లనిపించింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments